# ప్రజారాజ్యం

ప్రజలే ప్రభువులు

**లోక్‌సత్తా 'ఇ' సమాచారపత్రం**

సంపుటి : 1

సంచిక : 6

మార్చి 16-31 ,2006


# పంచాయతీలలో ప్రజారాజ్యం

# ప్రజలు తలచుకుంటే మార్పు తథ్యం

ఖమ్మం జిల్లా పర్యటనలో
డా॥ జయప్రకాష్ నారాయణ్

2006 మార్చి 9 తేదీన లోక్‌సత్తా జాతీయ సమన్వయకర్త డాక్టర్ జయప్రకాష్ నారాయణ్ సుడిగాలి పర్యటన చేశారు. ఉదయం 9 గం ॥ నుంచి రాత్రి 10 గం॥ ల వరకు ప్రజారాజ్యం యాత్ర సాగించారు. మణుగూరు , భద్రాచలం, పాల్వంచ, కొత్తగూడెం, ఇల్లెందు, ఖమ్మం జిల్లాలలో పలు బహిరంగ సభలలో ప్రసంగించారు. ఈ పర్యటనలో లోక్‌సత్తా రాష్ట్ర కార్యదర్శి శ్రీ పి. కోదండ రామారావు, రాష్ట్ర సంస్థ సభ్యులు శ్రీ విజయ రాఘవరావు, జిల్లా అధ్యక్ష కార్యదర్శులు డా॥ ఎస్.ఎల్. కాంతారావు, శ్రీమతి లీలావతి తదితరులు పాల్గొన్నారు.

### ఖమ్మం

ఖమ్మంలో భక్త రామదాసు కళాక్షేత్రంలో జరిగిన ప్రజారాజ్య చైతన్య సదస్సులో డా॥ జయప్రకాష్ నారాయణ మాట్లాడుతూ గ్రామాల స్థితి గతులను మార్చడానికి కొత్త రాజకీయ సంస్కృతికి నాంది పలకడానికి యువతరం నడుం కట్టాలని పిలుపునిచ్చారు. విలువలకు కట్టుబడి మంచి నాయకత్వాన్ని అందించడం కోసం ప్రజారాజ్య శిక్షణ ఉద్దేశించబడిందని ఆయన పేర్కొన్నారు. గ్రామాలలో విద్య, ఆరోగ్యం,ఉపాధి స్థితిగతులను మెరుగుపర్చడమే ఈ ఉద్యమ లక్ష్యంగా ఆయన పేర్కొన్నారు.

### భద్రాచలం

విద్యను పట్టించుకోని సమాజానికి ఆరోగ్యాన్ని పట్టించుకోని సమాజానికి భవిష్యత్తు శూన్యమని గ్రామాలలో అధ్వాన్నంగా వున్న విద్య, ఆరోగ్య అంశాలను మెరుగుపర్చడం కోసమే ప్రజారాజ్యం శిక్షణ తలపెట్టినట్లు లోక్‌సత్తా జాతీయ సమన్వయకర్త డా॥ జయప్రకాష్ నారాయణ్ పిలుపునిచ్చారు.

### మణుగూరు

ఎన్నికల్లో నోట్లు వెదజల్లడం ఆపైన నోట్లు దండుకోవడం పదవుల్ని దుర్వినియోగం పర్చడం అవినీతిలో మునిగితేలడం, రాజకీయాంగా చలామణి కావడం సాగనివ్వకూడదని ప్రజాసేవకు అంకితమైన రాజకీయం కోసం ప్రజల చదువు, ఆరోగ్యం చుట్టూ తిరిగే రాజకీయం కోసం యువత రంగంలోకి దిగాలని మణుగూరులో జరిగిన సభలో డా॥ జయప్రకాష్ నారాయణ్ పిలుపునిచ్చారు.

### బూర్గంపాడు

దేశాన్ని మార్చుకుందాం-పంచాయతీలతో ప్రారంభిద్దాం. అన్న నినాదంతో యువత రాజకీయాల్లో చురుకైన పాత్ర వహించాలని, పదవి చుట్టూ అవినీతి చుట్టూ తిరుగుతున్న రాజకీయానికి చరమగీతం పాడి గ్రామాల అభివృద్ధికి దోహదం చేసే కొత్త రాజకీయ సంస్కృతికి నాంది పలకాలని పిలుపునిచ్చారు.

### పాల్వంచ

నూతన రాజకీయ సంస్కృతి కోసం ఉద్యమించాల్సిన సమయం ఆసన్నమైందని డా॥ జయప్రకాష్ నారాయణ పిలుపునిచ్చారు. భ్రష్టుపట్టిన రాజకీయాలు జన జీవనాన్ని కుదిపి వేస్తున్నాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజాసేవ పేరుతో స్వార్థ రాజకీయాలు చేస్తూ ప్రజాధనాన్ని దోచుకొంటున్నారని ఆయన రాజకీయపార్టీలపై మండిపడ్డారు. డాక్టర్ అంబేద్కర్, గాంధీజీ ఆశయాల కనుగుణమై ప్రజారాజ్య స్థాపనకు కృషి చేయాలన్నారు.

### కొత్తగూడెం

ప్రజలు తలచుకుంటే దేశంలో మార్పు తప్పక వస్తుందని జయప్రకాష్ నారాయణ్ అన్నారు. మార్పు విషయంపై ఎలాంటి నిరాశ, నిస్పృహలకు లోను కావల్సిన అవసరం లేదన్నారు. కొత్తగూడెంలోని సత్రంలో లోక్‌సత్తా అధ్వర్యంలో గురువారం నిర్వహించిన 'ప్రజారాజ్య ఉద్యమ చైతన్య సదస్సు'లో ఆయన మాట్లాడారు. సమస్యల పరిష్కారంలో ప్రభుత్వాలు చిత్తశుద్ధిని ప్రదర్శించడం లేదన్నారు. రాజకీయాలంటే.. ప్రజలకు సేవ చేసే విధంగా ఉండాలని, సమాజంలో రుగ్మతలను రూపుమాపే విధంగా ఉండాలని ఆయన సూచించారు. మంచి పాలన, ప్రజల మేలు, మంచి రాజకీయం కోసం రాబోయే పంచాయతీ ఎన్నికల్లో పోటీకి యువతరం సిద్ధం కావాలన్నారు.

### ఇల్లెందు

భుజం కలపండి, కదం తొక్కండి. గొంతు విప్పండి ఒక్కసారి ఆలోచించండి. అంటూ డాక్టర్ జయప్రకాష్ నారాయణ ప్రజలకు పిలుపునిచ్చారు. ఇల్లెందు పట్టణంలోని మెయిన్‌రోడ్డు లో ఉన్నత పాఠశాలలో గురువారం రాత్రి ఏర్పాటు చేసిన 'నూతన రాజకీయ సంస్కృతికి ప్రజారాజ్య ఉద్యమ చైతన్యసదస్సు'లో ఆయన ప్రసంగించారు. ఆదర్శవంతమైన సమాజం కోసం కృషిచేయాలని ఆయన కోరారు. రాజకీయం సొంత ఆస్తిగా, కుటుంబ వారసత్వంగా పదవులు మారాయని ఆవేదన వ్యక్తం చేశారు. కార పదవులు మారాయని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమానికి హాజరైన విద్యార్థులతో ఆయన కొంతసేపు ముచ్చటించారు.

---

## ఎన్నికల ప్రక్రియలో సంస్కరణలు అవసరం : కెజె రావు

చీరాల, మార్చి 12 : దేశంలో ప్రజాస్వామ్యబద్ధంగా జరుగుతున్న ఎన్నికల ప్రక్రియలో ఇంకా సంస్కరణలు తీసుకురావాల్సి ఉందని ఎన్నికల కమిషన్ మాజీ అధికారి కొమ్మాజోస్యుల జగన్నాథరావు పేర్కొనారు. ఆదివారం లోక్‌సత్తా ప్రకాశం జిల్లా చీరాలలో నిర్వహించిన ఓ సదస్సులో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా కెజె రావు మాట్లాడుతూ బీహార్, జమ్ము కాశ్మీర్ ఎన్నికలలో నా విధిని నేను నిర్వర్తించానన్నారు. ముఖ్యంగా బోగస్ ఓటర్లపై కమిషన్ దృష్టి పెట్టాలన్నారు. క్రమం తప్పకుండా ఓటర్ల జాబితాను పూర్తిస్థాయిలో సర్వే చేయాలన్నారు.

### ప్రత్యేక సర్వీసు ఉండాలి.

గుంటూరు : ఎన్నికల నిర్వహణకు ఇండియన్ ఎలక్షన్ సర్వీస్ (ఐఇఎస్) లాంటి సర్వీసును ఏర్పాటు చేయాలని కెజె రావు అన్నారు. గుంటూరు లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రస్తుతం దేశంలో ఐఎఎస్, ఐపిఎస్ వంటి సర్వీసులు ఉన్నవిధంగానే ఐఇఎస్ వంటి సర్వీస్‌ను ఏర్పాటు చేయాలన్నారు. గ్రామ పంచాయితీ. ఇతర స్థానిక సంస్థల ఎన్నికలను కూడా ఈ సర్వీసు పర్యవేక్షిస్తుందన్నారు. ఇటువంటి సర్వీసు ఏర్పాటు చేయాలని పేరిశాస్త్రి కమిషనర్‌గా ఉన్నప్పుడు ప్రతిపాదించారన్నారు. ఓట్ల శాతం ఆధారంగా పరిపాలన సాగాలని జస్టిస్ వెంకటాచలయ్య ప్రతిపాదనలు చేశారన్నారు. ఇవన్నీ ప్రస్తుతం పరిశీలనదశలోనే ఉన్నాయన్నారు. తాను ఎన్నికల కమిషన్ నుంచి వైదొలగడంలో ఎటువంటి ఒత్తిళ్లు లేవనిస్పష్టం చేశారు.

## తెలుసుకోదగ్గ సమాచారం

### తీర్పులలో అత్యాచార బాధితుల పేర్లు ప్రస్తావించవద్దు : సుప్రీం

న్యూఢిల్లీ, మార్చి 12 : అత్యాచారానికి గురైన మహిళలను సమాజం చిన్న చూపు చూడకుండా నిరోధించాలనే ఉద్దేశంతో బాధిత మహిళల పేర్లను తీర్పులలో ప్రస్తావించకూడదని సుప్రీం కోర్టు పేర్కొంది. ఈ మేరకు అన్ని హైకోర్టులు, కింది కోర్టులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది.

'అత్యాచారానికి గురైన మహిళల పేర్లను తీర్పులలో ప్రస్తావించరాదు. సుప్రీంకోర్టులో కానివ్వండి, హైకోర్టు లేదా కింది కోర్టులలో ఏ కోర్టులో అయినా తీర్పులలో బాధితురాలి పేరుని వెల్లడించకూడదు. అని జస్టిస్ అరిజిత్ పసాయత్, జస్టిస్ ఎస్.హెచ్. కపాడియాలతో కూడిన డివిజన్ బెంచ్ పేర్కొంది.

ఇండియన్ పీనల్‌కోడ్ సెక్షన్ 228 - ఎ ప్రకారం అత్యాచార బాధితుల పేర్లను బయటకు వెల్లడించడం, ప్రచురించడం శిక్షార్హమైనది. అయితే ఈ సెక్షన్ కోర్టు తీర్పులకు వర్తించదు. అయినప్పటికీ అత్యాచార బాధితులు సామాజికంగా అవమానాలు ఎదుర్కోవడాన్ని నిరోధించడానికి తీర్పులలో కూడా వారి పేర్లను ప్రస్తావించవద్దని న్యాయమూర్తులు స్పష్టం చేశారు. మహిళ లపై లైంగిక వేధింపులకు సంబంధించిన కేసుల్ని ఎంతో సున్నితంగా విచారించాలని పేర్కొన్నారు.

## పాలకుండలో విషం చుక్కలు...

# ప్రభుత్వ పెత్తనం కోసమే మ్యాక్స్ చట్టం నుండి డైరీల మినహాయింపు

-మామిడి రామరెడ్డి

పాల ఉత్పత్తిదారుల సహకార సంస్థలను మ్యాక్స్ చట్టం పరిధినించి తప్పించి, **1965** నాటి పాత చట్టం పరిధిలోనికి తిరిగి చేర్చాలన్న ప్రభుత్వ ప్రయత్నం ఆయా సంస్థలను నాశనం చేస్తుంది. మ్యాక్స్ చట్టం ద్వారా లభించిన స్వయం ప్రతిపత్తిని హరిస్తుంది. మ్యాక్స్ చట్టం ద్వారా పాలసహకార సంస్థలు సాధించుకున్న ప్రగతిని నిరోధిస్తుంది. ప్రభుత్వ ఆలోచనలో అవగాహన రాహిత్యం, అపోహలతోపాటు రాజకీయ దురుద్దేశ్యాలు కూడా కలగలసి వున్నాయి. అధికారగణపు వ్యక్తిగత ఆలోచనలు, సమస్యల వక్రభాష్యం కూడా వీటికి తోడయ్యాయి. ఫలితమే చట్ట సవరణకు సంబంధించిన ఆర్డినెన్సు జారీ, పర్యవసానంగానే పాలక మండళ్ళ రద్దు జరిగిపోయాయి. దీనిని సహకార సంస్థలు హైకోర్టులో సవాలు చేసాయి. హైకోర్టు తన మధ్యంతర ఉత్తర్వులలో జి.వొ. అమలును నిలిపివేసింది. దీనిపై విచారణ కొనసాగుతున్నది. తుది ఉత్తర్వులు ఇంకా రావాల్సి వున్నది. ఈ నేపథ్యంలో ఈసమస్య పూర్వాపరాలను చర్చించాల్సి వుంది.

పాడిపరిశ్రమాభివృద్ధికి గుజరాత్‌లోని ఆనంద్‌డెయిరీ శ్రీకారం చుట్టింది. పాల ఉత్పత్తి, పాల సేకరణ, శుద్ధి ప్రక్రియ, వివిధ పాల ఉత్పత్తుల తయారీ, పాలు, పాల ఉత్పత్తుల అమ్మకాలు వంటి కార్యకలాపాలను ఉత్పత్తిదారులే సమిష్టిగా నిర్వహించుకోవడం ఆనంద్ డెయిరీ అనుసరించిన మార్గం. అందుకోసం పాల ఉత్పత్తిదారుల సహకార సంఘాలను ఏర్పాటు చేసారు. 'అమూల్ బ్రాండ్ పేరుతో పాలు, పాల ఉత్పత్తుల అమ్మకాలు సాగించారు. వినియోగదారులకు సరసమైన ధరలకు విక్రయించారు. పాల ఉత్పత్తిదారులకు గిట్టుబాటు ధరను కల్పించారు. 'అమూల్' బ్రాండ్‌కు విశేష ప్రజాదరణ లభించింది. ఫలితంగా 'అమూల్' ఒక విజయగాథ గా ప్రసిద్ధి చెందింది. సహకార రంగంలో పాడి పరిశ్రమాభివృద్ధి ఏ విధంగా సాధించవచ్చో ఆనంద్ డెయిరీ నిరూపించింది. పాడి పరిశ్రమ ద్వారా ఆర్థికంగా గ్రామీణ రైతులు పురోభివృద్ధి సాధించారు.

ఆనంద్ సాధించిన విజయాన్ని దేశమంతటా అనుకరించాలని భారత ప్రభుత్వం భావించింది. ఈ బాధ్యతను నేషనల్ డెయిరీ డెవలప్‌మెంట్ బోర్డుకు అప్పగించింది. నాటినుండి పాల ఉత్పత్తిదారుల సహకార ఉద్యమం దేశమంతటా విస్తరించింది. "ఆనంద్ నమూనా" గా పిలవడం మొదలయ్యింది.

### ఆనంద్ నమూనా

సొంత పశువును కలిగి, పాల ఉత్పత్తిదారులు సభ్యులుగా వుండే గ్రామస్థాయి ప్రాథమిక పాల ఉత్పత్తి దారుల సహకార సంఘాలు మొదటి అంచెగాను, అటువంటి ప్రాథమిక సంఘాల సభ్యత్వంతో ఒక జిల్లా లేదా కొన్ని జిల్లాల పరిధిలో ఏర్పడే పాల సహకార సమితులు మధ్యంతర అంచెగాను వివిధ జిల్లాల పాల సమితుల సభ్యత్వంతో రాష్ట్ర సహాకార సమాఖ్యపై స్థాయి అంచెగాను ఏర్పడ్డాయి. ఎన్.డి.డి.బి. సూచనల మేరకు దేశంలో **175** జిల్లాల పాలసమితులు, **16** రాష్ట్రాల్లో రాష్ట్రస్థాయి సమాఖ్యలు ఏర్పడ్డాయి.

రైతులు తమ పాల ఉత్పత్తిని సమర్ధవంతంగా చేసుకునేందుకు వీలుగా పశుపోషణ, పశు ఆరోగ్య సంరక్షణ, పశు సంతతి అభివృద్ధి, నాణ్యత ఆధారంగా పాల సేకరణ, మంచిధర చెల్లింపు ప్రాథమిక సంఘాల బాధ్యత. సభ్యసంఘాలకు అవసరమైన సలహా సంప్రదింపులు అందించడం, సాంకేతిక సహకారం, పాలరవాణా, పాలు, పాల పదార్థాల తయారీ, సకాలంలో పాల సరఫరా వంటి బాధ్యతలను రెండవ అంచెలోని జిల్లాల పాల సమితులు నిర్వహిస్తాయి. జిల్లా పాల సమితుల అవసరాలకు, అవకాశాలకు అనుగుణమైన నెలవారీ ప్రణాళికల రూపకల్పన, ఉత్పత్తి మార్కెటింగ్, పాలవెల్లువ పథకం అమలులో భాగంగా అవసరమైన భవనాల నిర్మాణం, యంత్ర సామాగ్రిస్థాపన, జిల్లా సమితి సక్రమ నిర్వహణ, మూడంచెలలోని సభ్యుల అవసరాలకు, అనువైన కార్యక్రమాల నిర్వహణ పై అంచెలోని రాష్ట్ర సమాఖ్య బాధ్యతలు.

సమిష్టి బాధ్యతల నిర్వహణలో సమన్వయం కోసం రాష్ట్ర సమాఖ్య ప్రోగ్రామింగ్ కమిటీలో సమాఖ్యకు చెందిన, జిల్లా సమితులకు చెందిన ముఖ్య అధికారులు సభ్యులుగా వుంటారు. సభ్య సమితుల అధ్యక్షులు సమాఖ్య పాలక వర్గంలో సభ్యులుగా వుంటారు. సమన్వయ విషయాలన్నీ ప్రోగ్రామింగ్ కమిటీ రూపొందిస్తుంది. పాలకవర్గ

ఆమోదంతో అవి అమలులోకి వస్తాయి. ప్రతి నెలా తప్పనిసరిగా ముందు ప్రోగ్రామింగ్ కమిటీ సమావేశం, ఆ తర్వాత పాలకవర్గ సమావేశం జరిగే ఏర్పాటు వున్నది.

స్వయం ప్రతిపత్తి కలిగిన పై రెండంచెల వ్యవస్థలు, ఉభయుల ఆమోదంతో ప్రతినెలా రూపొందించుకున్న ప్రణాళికను, లిఖితపూర్వక అవగాహన పత్రంలో నిర్దేశించుకున్న ప్రకారం అమలు చేసే బాధ్యత వహించాలి. ఇదీ పాల సహకార వ్యవస్థలో ఏర్పాటయిన పద్ధతి.

ఉత్పత్తిదారుని నుండి వినియోగదారునికి పాలు చేరడంలో ఆర్థిక సామర్థ్యం వుండాలి. పశువుల పాలసార నాణ్యమైనది కావాలి. దాని పోషణ నాణ్యంగా వుండాలి. మార్కెట్ అవసరాలకు అనుగుణమైన పాల ఉత్పత్తులు తయారు చెయ్యాలి. గ్రామంలోని రైతునుండి పట్టణంలోని వినియోగదారునికి సరైన సమయంలో ఉత్పత్తులు అందుబాటులోకి రావాలి. అపుడే వినియోగదారుని నుండి వసూలు చేసిన విలువలో అధిక భాగం ఉత్పత్తిదారునికి అందుతుంది.

త్వరగా చెడిపోయే గుణం కలిగిన పాలను, పాల ఉత్పత్తులను నిల్వ ఉంచాలంటే, సున్నితమైన సాంకేతిక పరిజ్ఞానం ఉత్పత్తిదారునికి కావాలి. ఉత్పత్తి, తయారీ,నిల్వ వంటి వాటిని నిలకడగా కొనసాగించాలంటే యంత్ర సామాగ్రి, పెట్టుబడి కావాలి.

వినియోగదారులకు సరైన సమయంలో పాలను. పాల ఉత్పత్తులను అందించడం లో అనేక సమస్యలుంటాయి. పెద్దగా చదువు, నైపుణ్యం, డబ్బు, లేని సామాన్యరైతులు, వీటన్నింటిని వ్యక్తిగతంగా సమకూర్చుకోవాలంటే చాలా కష్టం. అందువల్ల ఈ లక్ష్యాలన్నింటినీ చేరడానికి 'అమూల్' పెంచి పోషించిన మూడంచెల సహకార వ్యవస్థ అత్యంత అనుగుణమైనదని ఆనంద్ నమూనా ఏనాడో నిరూపించింది.

## పాలవెల్లువ

'ఆనంద్ నమూనా' లో దేశవ్యాప్తంగా పాడి పరిశ్రమాభివృద్ధి కోసం ప్రభుత్వ పాల వెల్లువ పథకాన్ని దశలవారీగా అమలు జరిపింది. అయితే త్వరిత పురోగతి సాధించే పేరుతో ఎన్.డి.డి.బి.ఆనంద్ నమూనా లో మార్పులు చేసింది. కేవలం ఉత్పత్తిదారుల భాగస్వామ్యంతో, వారి క్రియాశీలపాత్రలో అభివృద్ధి చెందాల్సిన పాడి పరిశ్రమను ప్రభుత్వ సహకారంతో అభివృద్ధి చేయాలని సంకల్పించింది. రాష్ట్ర ప్రభుత్వాల పెట్టుబడులు, రకరకాల సహకారాలతోపాటు ప్రభుత్వం జోక్యం, ప్రమేయం, పెత్తనానికి అస్కారం ఏర్పడింది. పాలు ఉత్పత్తి చేసే సభ్యులకు మాత్రమే సభ్యత్వ అర్హత కలిగి, అన్ని స్థాయిలలో సభ్యులచే ఎన్నుకోబడిన పాలకవర్గాలు మాత్రమే ఉండాల్సిన పాలసహకార వ్యవస్థలో రాష్ట్ర ప్రభుత్వాల ప్రమేయం, జోక్యం మితిమీరింది. ప్రభుత్వం నామినేట్ చేసిన రాజకీయ నాయకులు పాల సహకార వ్యవస్థల పాలక వర్గాలలో చేరారు. అన్ని స్థాయిలలోను అధికారుల పెత్తనానికి ఆస్కారం ఏర్పరిచారు. పైగా సహకార సంస్థలు తమ అవసరాల మేరకు ఏర్పాటు చేసుకోవాల్సిన యంత్ర పరికరాలు వంటి వాటిని అధికారులు, నామినేటెడ్ పాలకవర్గాలు సంస్థల నెత్తిన రుద్దాయి. సంస్థల స్వయం ప్రతిపత్తి,, సావలంబన, స్వయం నిర్ణయాధికారం లేకుండా పోయాయి. ఫలితంగా పాల సహకార వ్యవస్థలు భ్రష్టుపట్టాయి.

అవగాహన పత్రంలోని అంగీకృత అంశాలు సక్రమంగా అమలు జరగలేదు. జిల్లా పాల సమితుల ఆస్థి భాగపు యాజమాన్య హక్కు జిల్లా సమితుల పేర మార్చడం జరగలేదు. పాతికేళ్ళుగా జిల్లా యూనియన్లు నిర్వహించిన వ్యాపారం ద్వారా, వాటి పెట్టుబడులపై పెరిగిన కోట్లాది రూపాయలు ఆస్థులు, అధికభాగం జిల్లా సమితులవే అయినప్పటికీ, ప్రాధమిక ఆస్థులు ప్రభుత్వం పేరున కొనసాగాయి. టేటిల్ హక్కు జిల్లా యూనియన్లకు మారలేదు. దాంతో యూనియన్లు తమ ఆస్థులకు తామే హక్కుదారులమని గుర్తింపును పొందలేకపోయాయి. ఇక సిబ్బంది విషయంలో జిల్లా పాల సమితుల స్వయం ప్రతిపత్తికి నిరంతరం భంగం కలుగుతూందనే వచ్చింది. ఉత్పత్తి మార్కెటింగ్ వంటి రంగాలలో సమాఖ్య ఆదేశాలను, జిల్లా సమితులు పాటించాల్సిన పరిస్థితి కొనసాగింది. సహకార స్ఫూర్తి, స్వయం ప్రతిపత్తి భావన బదులు నిరంకుశ అధికార యంత్రాగం పెత్తనం, ప్రభుత్వజోక్యం, సహకార పాల వ్యవస్థలను నిర్వీర్యం చేసాయి. రాష్ట్ర సమాఖ్యతోపాటు, అనేక జిల్లా సమితులు నష్టాల పాలయ్యాయి. మూతపడ్డాయి. రైతులకు గిట్టుబాటు ధర లభించని స్థితి ఏర్పడింది. ప్రైవేటు డైరీలు పుట్టుకొచ్చి, సహకార పాల ఉత్పత్తి సంఘాలను దెబ్బతీసాయి. ఉత్పత్తిదారులకు సరైన ధర రానీయకుండా చేసి, తాము లాభాలపంట పండించుకున్నాయి.

## మ్యాక్స్‌చట్టం

పాల సహకార వ్యవస్థలు మరణావస్థలో వున్న నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రూపొందించిన మ్యాక్స్‌చట్టం వాటికి ప్రాణం పోసింది. విజన్ 2020 లో భాగంగా మూడంచెల సహకార పాల వ్యస్థలన్నిటిని మ్యాక్స్‌చట్టం పరిధిలోనికి తీసుకురావాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. సహకార వ్యవస్థలో ప్రభుత్వం ప్రత్యక్ష ప్రమేయం ఏ విధంగా వుండరాదన్నది ఈ చట్టం వుద్దేశ్యం. ప్రభుత్వం పై ఆర్థికంగా ఆధారపడకుండా వుండటం, ప్రాధమిక ఆస్థులలో ప్రభుత్వం భాగానికి సంబంధించిన యజమాన్య

హక్కులు జిల్లా సమితులకు దఖలు పరచడం, పాలవెల్లువ పథకంలో పెట్టుబడులపై జిల్లా సమితులకిచ్చిన కౌంటర్ గ్యారంటీల నుండి రాష్ట్ర ప్రభుత్వాలు విడుదల పొందడం వంటివి జరగాలని ఎన్.డి.డి.బి. భావించింది. అందుకు అనుగుణంగానే 1995 నాటి మ్యాక్స్‌చట్టం రూపొందింది. రెండు, మూడవ అంచెలు పూర్తి స్వయం ప్రతిపత్తిపొందడం, అయా అంచెల బాధ్యతలను సక్రమంగా నిర్వచించడం, వాటిని క్రియాశీలంగా అమలు చేయడం ఈ మార్పు లక్ష్యంగా పేర్కొనడం జరిగింది.

మాక్స్ పరిధిలో రాష్ట్ర సమాఖ్య కేవలం మార్కెటింగ్ వ్యవస్థగా వుంటుంది. అందులో వివిధ రంగాల ప్రత్యేక నైపుణ్యాలు కలిగిన సాంకేతిక నిపుణులు వుంటారు. సిబ్బంది సర్వీసులన్నీ జిల్లా సమితుల పరిధిలోకి వస్తాయి. అవసరం మేరకు సిబ్బందిని కుదించుకోవచ్చు. అర్హత, అనుభవం, పని నిర్వహణా సామర్థ్యంపై ఆధారపడిన పదోన్నతుల విధానం అమలు జరుగుతుంది.

మాక్స్ చట్టం అమలులోకి వచ్చాక సహకార పాల యూనియన్ల పనితీరు బాగా మెరుగుపడింది. పాతికేళ్ళుగా ఏనాడూ ఆలోచనలోకిరాని షేరుధనం విషయంలో అత్యంత జాగ్రత్త తీసుకోవడంతో, షేరుధనం ఐదునించిఎనిమిదిరెట్లు పెరిగింది. జిల్లా వ్యవస్థల సిబ్బంది సమస్యపై దృష్టి సారించడం జరిగింది. వ్యవస్థల పనితీరు సామర్థ్యం పైనే తమ భవిష్యత్తు ఆధారపడివుందన్న అవగాహన సిబ్బందిలో కల్గించడం వీలయ్యింది. కార్యనిర్వహణలో సిబ్బంది భాగస్వామ్యాన్ని పెంచడంలో కొంత పురోగతి సాధ్యమయ్యింది. సిబ్బంది తగ్గింపునకు అవకాశలున్నచోట్ల జిల్లా సమితులు ఆ మేరకు తగు చర్యలు తీసుకున్నాయి. వృధా భారాన్ని ఆదా చేయగలిగాయి.

స్థానికంగా పాల ఉత్పత్తుల్లో అమ్మకాలను ఉధృతం చేయడం ద్వారా ఆదాయం బాగా పెరిగింది. పాల ఉత్పత్తిదారులకు తగిన పాలధర చెల్లించడానికి ప్రాధాన్యం వచ్చింది. జిల్లా సమితులు తమ శక్తి మేరకు ఉత్పత్తిదారులకు పాలధర చెలిస్తూ వచ్చాయి. జిల్లా సమితులు చెల్లించిన ధర, రాష్ట్ర సంస్థ చెల్లించే ధర కంటే ఎప్పుడూ ఎక్కువే వుంది. మ్యాక్స్ చట్టంలోకి ముందుగా మారిన విశాఖ, గుంటూరు జిల్లాల డెయిరీలు తమ స్వంత మార్కెటింగ్ వ్యవస్థలను ఏర్పాటు చేసుకున్నాయి. రాష్ట్ర సమాఖ్యకంటే ఎక్కువ మార్కెటింగ్ సామర్థ్యాన్ని సంతరించుకున్నాయి. ఖర్చులను బాగా తగ్గించుకోగలిగాయి. దాంతో ఎక్కువ ఆదాయాన్ని ఆర్జించుకున్నాయి. పాతికేళ్ళ అనుభవం వున్న రాష్ట్ర సమాఖ్యతో పోలిస్తే, కేవలం నాలుగైదేళ్ళ అనుభవం మాత్రమే కల్గిన విశాఖ, గుంటూరు జిల్లాల సమితులు నిలదొక్కుకోవడం గమనార్హమైన విషయం

రాష్ట్ర సమాఖ్యలో భాగస్వామ్య వ్యవస్థలుగా వుంటూ సరైన అభివృద్ధి అవకాశాలు లేక, ఆశించిన మార్పులు రాక సగం వ్యాపారం స్వంతగాను, మిగిలిన సగం వ్యాపారం సమాఖ్యద్వారాను సాగిస్తున్న జిల్లా సమితులు మధ్యంతరంగా మిగిలిపోయి వున్నాయి. రాష్ట్ర వ్యవస్థ జోక్యం వల్లనే ప్రకాశం జిల్లా డెయిరీ నష్ట పోయిందని చెప్పక తప్పదు. జిల్లాలో రాష్ట్ర, వ్యవస్థ పాల సరఫరాను యథాతథంగా కొనసాగించింది. బైట మార్కెట్ వున్నప్పటికీ,రాష్ట్రసంస్థ ఒత్తిడివల్ల జిల్లా సమితి పాల ఎగుమతులను స్వంతంగా చేపట్టలేకపోయింది. ప్రైవేటు డెయిరీల పోటీకి అనుగుణంగా సేకరణ ధర పెంచలేని అశక్తతతో, జిల్లా డెయిరీ సేకరణ బాగా పడిపోయింది. ఆస్థి జిల్లా సమితి పేర వ్రాతపూర్వకంగా మార్పు చెందకపోవడంతో, నిజానికి జిల్లా సమితికి స్వంత ఆస్థి ఎక్కువ వున్నప్పటికీ, ఆర్థిక సహాయ సంస్థల నుండి రుణాలు పొందలేక పోయింది. సమాయానుసారం నిర్వహణా మార్పులను చేసుకోలేని స్థితిలో వ్యాపార నిర్వహణ కుంటుపడిపోయింది.

రాష్ట్ర సంస్థ హైదరాబాద్ డెయిరీ ద్వారా ఉత్పత్తుల పెంపుదలకు ప్రయత్నిస్తున్నప్పటికీ, మార్కెటింగ్ నానాటికీ తగ్గిపోతున్నది. దీనితో సహకరించిన ప్రకాశం జిల్లా డెయిరీ, తద్వారా సంక్రమించిన నష్టాల ఫలితంగా సమాఖ్యను విడిచి తన ఏర్పాటు తానే చూసుకోవాల్సిన పరిస్థితి తప్పనిసరి అయ్యింది. సమాఖ్య క్రుంగిపోవడంతో పాటు కొన్ని జిల్లాల పాలు సమితుల పరిస్థితి అగమ్యగోచరంగా తయారయ్యింది.

సహకార ఉత్పత్తిదారుల వ్యవస్థలకు, ప్రభుత్వానికి జరిగిన అవగాహన ఒప్పందాల మేరకు రాష్ట్ర మొత్తం మీద వున్న ఆస్థులలో ప్రభుత్వ వాటా 30 శాతం లోపు మాత్రమే వున్నది. జిల్లాలో అయితే ఇది ఇరవై శాతానికి మించదు. ప్రకాశం జిల్లాలో అయితే ప్రభుత్వ వాటా 7 శాతం మాత్రమే. బాధ్యతల నిర్ణయం సక్రమంగా జరగక పోవడం, బదలాయింపు ప్రక్రియ రిజిస్ట్రేషన్ జరగక పోవడంతో ఆయా ఆస్థులు ప్రభుత్వ పేరున కొనసాగుతున్నాయి. ఇదికేవలం సాంకేతిక పరమైన అంశమే తప్ప ఇందులో ప్రభుత్వానికి ఏ విధమైన హక్కు లేదు. అయితే ప్రభుత్వం మాత్రం ఈ ఆస్థులన్నీ తనవేనంటూ హైకోర్టుకు నివేదించింది.

రాష్ట్ర ప్రభుత్వం ప్రస్తుతం జారీ చేసిన ఆర్డినెన్సు వెనుక పూర్వాపరాల పరిశీలనగాని, వాస్తవాల విశ్లేషణ గాని ఏమీ లేమి లేదు. విశాఖ, చిత్తూరు జిల్లాల సమితులపై ఆరోపణలు వున్నాయని చెప్పడం కేవలం రాజకీయ దేరుద్దేశంతో మాత్రమేనని భావించాలి. శాసనసభా కమిటీని నియమించి వందిమాగధులైన అధికారులను చేర్చి, వాస్తవాలలోకి వెళ్ళకుండా సహకార పాల వ్యవస్థలను మ్యాక్స్‌చట్టం పరిధి నుండి తప్పించాలని చూడడం ముందుగా

నిర్ణయించుకుని పథకం సాగిస్తున్న ప్రయత్నమేనని చెప్పకతప్పదు. నిరాధార ఆరోపణలతో చట్ట సవరణకు పూనుకోవడంలో అవగాహనా రాహిత్యం దురుద్దేశ్యం మాత్రమే కన్పిస్తున్నాయి.

తాను నిర్వహిస్తున్న రాష్ట్ర సమాఖ్య నష్టాల పాలయినా, దాని ఆధ్వర్యంలోని జిల్లాల సమితులు మూతపడినా చీమకుట్టని ప్రభుత్వానికి, లాభాలబాటలో నడుస్తున్న డెయిరీలను బాగు చేద్దామన్న వుద్దేశ్యం కలిగిందట. ప్రభుత్వ ఆస్తులతోనే మ్యాక్స్ డెయిరీలు లాభాలు గడిస్తున్నాయట. ప్రభుత్వ ప్రమేయం లేకపోతే పాల ఉత్పత్తి దారులంతా నష్టపోతారట. ఉత్పత్తిదారులపై మ్యాక్స్ డెయిరీలు గుత్తాధిపత్యం నిర్వహిస్తున్నాయట. మ్యాక్స్ డెయిరీలు రైతులకు సరైన ధర ఇవ్వడం లేదట. ఇవీ మన ఘనత వహించిన రాష్ట్ర ప్రభుత్వం వారి వాదనలు. తమ వాదనలలోని డొల్లతనం ఏమిటో వారికి బాగా తెలుసు. అయినా వారు చేసిన పనిని సమర్థించుకోవడానికి రకరకాల సాకులు వెతుక్కుంటున్నారు.

పాడిపరిశ్రమ అభివృద్ధి చెందాలంటే ఇకముందు జరగాల్సిందేమిటి? ప్రభుత్వం గతంలో అంగీకార పత్రాలలో ఇచ్చిన హామీలను తు.చ తప్పకుండా నెరవేర్చాలి. పాల ఉత్పత్తి దార్ల వ్యవస్థలు ప్రభుత్వంపై ఏ మాత్రం ఆధారపడకుండా స్వయం ప్రతిపత్తితో వ్యవహరించేందుకు వీలుగా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకోవాలి. మూడంచెల వ్యవస్థలో భాగమైన రాష్ట్ర సమాఖ్య "ఆనంద్ నమూనా" లోకి పక్కాగా రాలేని పక్షంలో జిల్లా సహకార వ్యవస్థలు గుంటూరు, విశాఖ తరహాలో స్వంత ప్రత్యామ్నాయాలను ఏర్పాటు చేసుకోవాల్సి వుంటుంది.

స్వయం సమృద్ధి కాలేకపోయిన, మూతపడిపోవడానికి సిద్ధంగా వున్న జిల్లాల పాల సహకార వ్యవస్థలను ప్రత్యేకంగా అభివృద్ధి చేయాలి. వీటికి ప్రభుత్వ సహకారం అవసరం. కాలక్రమేణా ఇటువంటి వ్యవస్థలు ప్రభుత్వ ఇచ్చే సహకారం అవసరం. లేకుండా స్వయంగా తమ కాళ్ళపై తాము నిలబడే విధంగా రూపొందాలి.

ఇవన్నీ జరగాలంటే పాల సహకార వ్యవస్థలను మ్యాక్స్ చట్టం పరిధిలోనే కొనసాగించాలి.

(వ్యాసకర్త సహకార రంగ నిపుణులు, సహవికాస సంస్థ అధ్యక్షులు)

---

## లోక్‌సత్తా రాష్ట్ర సమన్వయ సంఘ సమావేశం

సమయం : 2006 ఏప్రిల్ 8 - శనివారం
ఉదయం 10 గం॥ నుండి సా॥ 5 గం॥ వరకు

స్థలం : ఫ్యాప్సీ హాలు - రెడ్‌హిల్స్ - లక్డీకాపూల్ దగ్గర - హైదరాబాద్.
ఎజెండా :

1. కొత్త రాజకీయ సంస్కృతి - కార్యక్రమాలు - భవిష్యత్ ఆలోచనలు
2. పంచాయితీ ఎన్నికలు - అభ్యర్థుల శిక్షణ
3. జిల్లాలలో లోక్‌సత్తా అనుబంధ ప్రజాసంఘాలు - క్రమశిక్షణా నియమావళి
4. యువజన - మహిళా సంస్థల కార్యకలాపాలు - సమన్వయం
5. జిల్లా, రాష్ట్ర ఆఫీసు బేరర్ల పర్యటనలు - పాటించవలసిన అంశాలు
6. సంస్థాగత అంశాలు - ఇతరములు

**గమనిక :** రాష్ట్రస్థాయిలో లోక్‌సత్తా సంస్థాగత పటిష్టత కోసం 5 రోజులు శిక్షణా కార్యక్రమాలు నిర్వహించడం అవసరం ఇది క్రియాశీల కార్యకర్తలకు ఉద్దేశించబడింది. తగిన సమయం ఇవ్వగలవారు - ప్రజాసమస్యలపై స్పందనతో కార్యకలాపాలను నిర్వహించడం పట్ల, కొత్త రాజకీయ సంస్కృతిని ప్రచారం చేయడం పట్ల ఆసక్తి గల వారిని ఎంపిక చేసుకోవాలి. ప్రతి జిల్లా నుండి 20-25 మంది కార్యకర్తలను ఎంపిక చేసి ఆ పేర్లు సమావేశం నాటికి తీసుకురావలసిందిగా కోరుతున్నాం.

## డా॥ జయప్రకాష్ నారాయణ్ ప్రజారాజ్యం పర్యటన

2006 మార్చి 28 ప్రకాశం జిల్లా
2006 మార్చి 29 కర్నూలు జిల్లా ,

## ప్రజారాజ్యం
### శిక్షకులకు శిక్షణా కార్యక్రమం

### వివిధ జిల్లాల్లో శిక్షణా కార్యక్రమాలు

| | | |
|---|---|---|
| మార్చి 22, 23 | కర్నూలు జిల్లా | మహానంది |
| మార్చి 23,24 | గుంటూరు జిల్లా | గుంటూరు |
| మార్చి 25,26 | ఖమ్మం జిల్లా | భద్రాచలం |
| మార్చి 25,26 | క్రిష్ణ జోన్ | తాడేపల్లి గూడెం |

# సూక్తులు

* రాయటం ద్వారా, చదవటం ద్వారా, మాట్లాడటం ద్వారా మాత్రమే మనిషి తన మేధస్సును పెంచుకోలేడు. -గాంధీజీ

* అధికారం పెరిగేకొద్దీ దాన్ని దుర్వినియోగపరచే ప్రమాదమూ పెరుగుతుంది. - ఎడ్మండ్ బర్క్

* శరీరానికి వ్యాయమం అవసరమైనట్లే, మెదడుకు పుస్తక పఠనం అవసరం -అడిసన్

* వాస్తవాలు వాస్తవాలే. మనకు ఇష్టం లేనంత మాత్రాన అవి అదృశ్యమైపోవు -జవహర్‌లాల్ నెహ్రూ

* గౌరవం ఇవ్వటమూ, స్వీకరించటమూ మంచిదే. మనిషికీ మనిషికీ మధ్య అది సమతూకాన్ని ఉంచుతుంది. అయితే గౌరవం పూజించే స్థాయికి చేరుకోవటమంటే అకౌంట్‌లో ఉన్నదానికంటే ఎక్కువ చెల్లించటమే అవుతుంది. - రవీంద్రనాథ్ టాగూర్

* ప్రతీకారం అన్నది ఆటవిక న్యాయం లాంటిది -బేకన్

* తనలో లేని గుణాలు ఉన్నాయని చూపించుకోడానికి ప్రతి వ్యక్తీ తన జీవితంలో కొంత సమయాన్ని దుర్వ్యయం చేస్తుంటాడు. -సామ్యుయేల్ జాన్సన్

* ప్రజాస్వామ్యం అంటే చర్చ ద్వారా పరిపాలించటం. -క్లిమెంట్ ఆట్లే

* గడ్డిపోచలు మాత్రమే నీటిపైన తేలాడుతుంటాయి. ముత్యాలు కావాలనుకునే వారు లోలోతులకు మునగక తప్పదు. -డ్రైడన్

* ఈ లోకంలో భయపడాల్సింది ఏదైనా ఉందంటే అది భయమే. భయం గురించి భయపడాల్సిందే కాని వేరే భయాలేవీ లేవు. -ఫ్రాంక్లిన్ రూజ్వెల్ట్

# రాజకీయం

-నిసార్

పల్లవి : రాజకీయం అంటెనే ప్రజల కష్టాలు తీర్చేదిరా
ప్రజల సేవకై, ప్రజల మేలుకై రాజకీయంబుట్టెరా!

పిల్లలా చదువును పట్టించుకోవాలి
ప్రజల ఆరోగ్యాన్ని బద్రంగా చూడాలి
పాఠశాల చదువు పక్కన బెట్టిరి
ప్రజల ఆరోగ్యాన్ని గాలి కొదిలేసిరి
రాజకీయం చూడరా నేడు ప్రజల మరిచిపోయెరా
ఈ రాజకీయాన్ని చక్కదిద్ద లోక్‌సత్తా పిలుస్తోందిరా ॥ రాజ ॥

పల్లె మంచి కోరి పనులెన్నో జెయ్యాలి
ప్రజల మేలు కోరి పథకాలు జెయ్యాలి
కాంట్రాక్టు పనులతో కాజేసుతుండిరి
సంక్షేమ పథకాల భోంచేస్తువుండిరి
సొమ్మంత మనదేనురా ! ఓరయ్య-సోకు వాళ్ళదాయెరా
ఈ రాజకీయాన్ని చక్కదిద్ద లోక్‌సత్తా పిలుస్తోందిరా ! ॥ రాజ ॥

కులమతాల చిచ్చురాకుండా చూడాలి
దళితుల పేదలా మేలునూ కోరాలి
చిచ్చు పెట్టిటోడే లీడరూ కాబట్టె
రెచ్చగొట్టెటోడే గద్దె నేలబట్టె
పదవి కోసం లీడరూ ప్రజలనూ పెడదారి పట్టించెరా!
ఈ రాజకీయాన్ని చక్కదిద్ద లోక్‌సత్తా పిలుస్తోందిరా! ॥ రాజ ॥

ఊరి మెప్పుబొంది ఓట్లల్ల గెలవాలి
ప్రజలె ప్రభువులంటు సేవలందించాలి
ఓట్ల కొరకు నోట్లు వెదజల్లుతున్నారు
పదవులొస్తే అంత దోచుకుంటున్నారు
నోటుకు పదినోట్లురా రాబట్టె వ్యాపారమైపోయెరా
ఈ రాజకీయాన్ని చక్కదిద్ద లోక్‌సత్తా పిలుస్తోందిరా! ॥ రాజ ॥

చెడు రాజకీయమే రాజ్యమేలుతుంది
మన బతుకుతో చెలగాటమాడుతుంది
ప్రజల బతుకుల్లోన వెలుగునింపేటి
ప్రజరాజ్యమే మనకు కావాలి
మనమంత తలచుకుంటే నేటి రాజకీయం మారురా
లోక్‌సత్తా బాటలో ఏకమై మనమంత ఉద్యమిస్తే మేలురా ! ॥ రాజ ॥

# ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శాసనసభ ఎన్నికలు - 2004

## రాష్ట్రంలో పోటీ చేసిన వివిధ పార్టీలు

| పార్టీ పేరు | సీట్లు | | | పోలైన ఓట్లు | | పోటీ చేసిన స్థానాలలో పొందిన ఓట్ల శాతం |
|---|---|---|---|---|---|---|
| | పోటీ చేసినవి | గెలిచినవి | డిపాజిట్లు కోల్పోయినవి | ఓట్లు | శాతం | |
| **I జాతీయ పార్టీలు** | | | | | | |
| 1. భారతీయ జనతాపార్టీ – (బి.జె.పి) | 27 | 2 | 4 | 942008 | 2.63% | 29.72% |
| 2. బహుజన సమాజ్ పార్టీ – (బి.యస్.పి.) | 160 | 1 | 159 | 440719 | 1.23% | 2.21% |
| 3. కమ్యూనిస్టు పార్టీ ఆఫ్ ఇండియా (సి.పి.ఐ) | 12 | 6 | 0 | 545867 | 1.53% | 36.86% |
| 4. కమ్యూనిస్టు పార్టీ ఆఫ్ ఇండియా (మార్క్సిస్టు) – సి.పి.ఐ. (యం) | 14 | 9 | 3 | 656721 | 1.84% | 34.74% |
| 5. ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ – (ఐ.యన్.సి) | 234 | 185 | 8 | 13793461 | 38.56% | 49.10% |
| | **447** | **203** | **174** | **16378776** | **45.79%** | |
| **II రాష్ట్ర పార్టీలు** | 267 | 47 | 3 | 13444168 | 37.59% | 41.24% |
| 6. తెలుగు దేశం పార్టీ (టి.డి.పి) | 267 | 47 | 3 | 13444168 | 37.59% | |
| **III రాష్ట్ర పార్టీలు (ఇతర రాష్ట్రాలు)** | | | | | | |
| 7. కమ్యూనిస్టు పార్టీ ఆఫ్ ఇండియా (మార్క్సిస్టు – లెనినిస్టు) (లిబరేషన్) సి.పి.ఐ (యం.ఎల్) (ఎల్) | 11 | 0 | 10 | 66997 | 0.19% | 5.27% |
| 8. ఇండిజినస్ నేషనలిస్ట్ పార్టీ ఆఫ్ త్రిపుర (ఐ.యన్.టి.పి) | 1 | 0 | 1 | 1192 | 0.00% | 1.05% |
| 9. జనతాదళ్ (సెక్యులర్ ) (జె.డి. (యస్)) | 5 | 0 | 5 | 3864 | 0.01% | 0.64% |
| 10. ముస్లిం లీగ్–కేరళ స్టేట్ కమిటీ–(యం.యు.ఎల్) | 2 | 0 | 2 | 5371 | 0.02% | 1.04% |
| 11. రాష్ట్రీయ జనతాదళ్ (ఆర్.జె.డి) | 8 | 0 | 8 | 2725 | 0.01 | 0.33% |
| 12. సమాజ్ వాదీ పార్టీ (ఎస్.పి) | 19 | 1 | 18 | 95416 | 0.27% | 4.10% |
| | **46** | **1** | **44** | **175565** | **0.49%** | |
| **IV రిజిష్టర్డ్ పార్టీలు (గుర్తింపులేని)** | | | | | | |
| 13. అఖిల భారతీయ జనసంఘ్ – (ఎ.బి.జె.యస్) | 4 | 0 | 4 | 3792 | 0.01% | 0.55% |
| 14. ఆల్ ఇండియా మజ్లిస్–ఇ–ఇత్తెదుల్ ముస్లిమీన్– (ఎ.ఐ.యం.ఐ.యం) | 7 | 4 | 2 | 375165 | 1.05% | 42.48% |
| 15. అంబేద్కర్ నేషనల్ కాంగ్రెస్ । (ఎ.ఎన్.సి) | 5 | 0 | 5 | 6573 | 0.02% | 1.18% |
| 16. బి.సి. యునైటెడ్ ఫ్రంట్ – (బి.సి.ఆర్.పి) | 7 | 0 | 7 | 3652 | 0.01% | 0.41% |
| 17. బహుజన్ రిపబ్లిక్ పార్టీ – (బి.జె.ఆర్.పి) | 9 | 0 | 9 | 10576 | 0.03% | 0.90% |
| 18. భారతీయ రాష్ట్రవాదీ పక్ష – (బి.ఆర్.పి) | 1 | 0 | 1 | 542 | 0.00% | 0.37% |
| 19. బహుజన సమాజ్‌పార్టీ (అంబేద్కర్) (బి.యస్.పి. (ఎ)) | 1 | 0 | 1 | 2339 | 0.01% | 1.81% |
| 20. ఇండియన్ జస్టిస్ పార్టీ – (ఐ.జె.పి) | 2 | 0 | 2 | 1361 | 0.00% | 0.34% |

| పార్టీ పేరు | సీట్లు | | | పోలైన ఓట్లు | | పోటీ చేసిన స్థానాలలో పొందిన ఓట్ల శాతం |
|---|---|---|---|---|---|---|
| | పోటీ చేసినవి | గెలిచినవి | డిపాజిట్లు కోల్పోయినవి | ఓట్లు | శాతం | |
| 21. జనతా పార్టీ – ( జె.పి) | 37 | 2 | 30 | 306347 | 0.86% | 6.71% |
| 22. లోక్ జనశక్తి పార్టీ – (ఎల్.జె.ఎన్.ఎస్.పి) | 4 | 0 | 4 | 21550 | 0.06% | 3.71% |
| 23. మజ్లిస్ బచావొ తహరీక్ – (యం.బి.టి) | 7 | 0 | 5 | 70285 | 0.20% | 7.73% |
| 24. మార్క్సిస్టు కమ్యూనిస్టు పార్టీ ఆఫ్ ఇండియా (ఎస్.ఎస్. శ్రీవాత్సవ) యం.సి.పి.ఐ. (యస్) | 15 | 0 | 15 | 22181 | 0.06% | 0.97% |
| 25. ముదిరాజ్ రాష్ట్రీయ సమితి – (యం.ఆర్.ఎస్) | 5 | 0 | 5 | 10606 | 0.03% | 1.64% |
| 26. యన్.టి.ఆర్. తెలుగుదేశం పార్టీ (లక్ష్మీపార్వతి) యన్.టి.ఆర్.టి.డి.పి. (ఎల్.పి) | 18 | 0 | 18 | 7857 | 0.02% | 0.37% |
| 27. ప్రజాపార్టీ (పి.పి) | 8 | 0 | 8 | 4439 | 0.01% | 0.46% |
| 28. పిరమిడ్ పార్టీ ఆఫ్ ఇండియా – (పి.పి.ఒ.ఐ) | 65 | 0 | 65 | 115187 | 0.32% | 1.38% |
| 29. పీపుల్స్ రిపబ్లికన్ పార్టీ – (పి.ఆర్.బి.పి) | 1 | 0 | 1 | 1515 | 0.00% | 1.09% |
| 30. రాష్ట్రీయ ప్రజా కాంగ్రెస్ (సెక్యులర్) (ఆర్ .పి.సి. (యస్) | 1 | 0 | 1 | 1037 | 0.00% | 1.33% |
| 31. రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా (ఆర్.పి.ఐ) | 3 | 0 | 3 | 1523 | 0.00% | 0.44% |
| 32. రిపబికన్ పార్టీ ఆఫ్ ఇండియా (ఎ) ఆర్.ని.ఐ.(ఎ) | 1 | 0 | 1 | 956 | 0.00% | 1.06% |
| 33. రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా (ఖోబ్రగడే) ఆర్.పి. ఐ. (కె.హెచ్) | 5 | 0 | 5 | 6031 | 0.02% | 0.90% |
| 34. సమాజ్‌వాదీ పార్టీ (రాష్ట్రీయ) (యస్.జె.పి(ఆర్)) | 1 | 0 | 1 | 1991 | 0.01% | 2.05% |
| 35. తెలంగాణా కాంగ్రెస్ పార్టీ (టి.సి.పి) | 1 | 0 | 0 | 52161 | 0.15% | 38.34% |
| 36. తెలంగాణా ప్రజాపార్టీ (టి.జి.పి.పి) | 2 | 0 | 2 | 1083 | 0.00% | 0.63% |
| 37. తెలంగాణా రాష్ట్ర సమితి (టి.ఆర్.ఎస్) | 54 | 26 | 17 | 2390940 | 6.68% | 33.89% |
| | **264** | **32** | **212** | **3419689** | **9.56%** | |
| **V ఇండిపెండెంట్లు** | | | | | | |
| 38. ఇండిపెండెంట్ (ఐ.యన్.డి) | 872 | 11 | 837 | 2349436 | 6.57% | 7.31% |
| | 872 | 11 | 837 | 2349436 | 6.57% | |
| **మొత్తం** | **1896** | **294** | **1270** | **35767634** | | |